# దేవుని ప్రసన్నత సర్వవ్యాప్తమైనది

## మన దేవుడు ప్రాథమిక సారంలో "అక్కడ" లేడు

దేవుడు "అంతటనున్నవాడు"గా చెప్పబడ్డాడు. అంటే ఒకే సమయంలో ప్రతిచోట ఉంటాడు. ఇది కూడా లేఖనముల సాక్ష్యమే (యిర్మీయా 23:23, 24). ఇది ఎలా సాధ్యం? ఇందులో ఏమి ఉంది? దేవుడు ప్రతిచోట ఉన్నాడంటే, మహా విశ్వంలో నీవు ఎక్కడికైనాపో, దేవునికి సంబంధించినంత మట్టుకు "ఖాళీ" అనే గుర్తు పలకను నీవు ఎన్నడూ కనుగొనలేవు.

### దాని యొక్క వాస్తవం

విశ్వం విస్తారమైనది. దాని పొలిమేరలను చేరడానికి తగినంతగా మన మనస్సులను మనం పెంచలేం. మన చిన్న సూర్య కుటుంబమే చాలినంత పెద్దదిగా తోస్తుంది. నీల్ ఆమ్‌స్ట్రాంగును, "బజ్" ఆల్‌డ్రిన్ అనేవారు చంద్రునిమీద దిగేటప్పుడు మనమునూ లోకంలో యింకా కోట్లాది మందియూ ఎంత సంతోషంతోను ఆశ్చర్యంతోను చూచారో జ్ఞాపకం లేదా? నేడు మానవ అడుగుజాడలు చంద్రునిమీద ఉన్నాయి. భూమినుండి చంద్రుడు రమారమి 250,000 మైళ్ల దూరంలో ఉండగా, ఖగోళశాస్త్రం ప్రకారం మాట్లాడితే, అది మన వెనుక వరండాలా ఉంటుంది.

ఇప్పుడు, వెనుక వరండాను దాటి చుట్టుప్రక్కల చూడు. పైన సూర్యుని చూస్తాం. అది రమారమి 9 కోట్ల 30 లక్షల మైళ్ల దూరంలో ఉంది. దాని చుట్టు యింకా ఎనిమిది యితర గ్రహాలు తిరుగుతున్నాయి. అతి సమీపంగా ఉన్న "బుధుడు" అనే గ్రహం సూర్యునినుండి 3 కోట్ల 60 లక్షల మైళ్ల దూరంను; ప్లూటో అతి ఎక్కువ దూరంగానున్నది, 3700 కోట్ల మైళ్ల దూరంలో ఉంది. ప్లూటో ఒకసారి సూర్యునిచుట్టు తిరిగి రాడానికి 247 భూ సంవత్సరాలు పట్టుతుంది. ఈ పుస్తకం వ్రాస్తున్న కాలానికి ప్లూటోను దాటి మరియొక గ్రహం ఉన్నట్టు భూగోళ శాస్త్రవేత్తలు కనుగొన్నారు. ఇదంతా మన వెనుక వాకిలి సంగతి.

మనం కంచె దగ్గరకు వెళ్లి బయటికిని పైతట్టుకును చూద్దాం. స్పష్టంగానున్న రాత్రిలో, మన సూర్యుడు దానికి సంబంధించిన గ్రహాలును దేనిలో భాగమైయున్నవో ఆ "పాలపుంత"ను మనం చూడగలం. మిల్టిన్ హ్యూమ్‌సన్ మరియు ఎడ్విన్ హబుల్ యొక్క ఖగోళ శాస్త్ర పరిశోధనలో మన గెలాక్సీని అడ్డంగా చూస్తే 1లక్ష కాంతి సంవత్సరాల దూరమున్నట్టు స్థాపింపబడింది. కొన్ని దగ్గరగానున్న గెలాక్సీలు 1నుండి 7మిలియన్ల కాంతి సంవత్సరాలంత దూరంలో[1] ఉన్నాయని కూడా హబుల్ గమనించాడు. దీనికి తోడు, ఈ గెలాక్సీలు వాస్తవంగా "ద్వీపపు" గెలాక్సీలే విశ్వమంతట వ్యాపించియున్నట్టు పరిశోధన తీర్మానించగలదు.[2]

మనం చాలినంత దూరం వెళ్లి ఉండవచ్చు. విశ్వంలోని వాస్తవం మనస్సును వణకిస్తుంది. అది ఊహాతీతంగా విశాలమయ్యింది. దాన్ని కొలత వేసే విధానమే విశ్వం ఎంతటి అపరిమితమైనదో సూచిస్తుంది. దాని దూరాన్ని మైళ్లలో కొలత వేయడం సాధ్యం కాదు. కాంతి సంవత్సరాల కొలతలు ప్రమాణంలోనికి వచ్చాయి.

దేవుని స్వభావాన్ని గూర్చిన మన పఠనంలో యిదంతా బహు గొప్ప ప్రాధాన్యత కలిగియుంది. "కాంతి సంవత్సరం" అనేది సమయాన్ని తెలిపే పదమైయుంది. గనుక, కాలాన్ని గూర్చిన ఆలోచనలు దేవుని గూర్చిన మన గ్రహింపుకు ప్రాముఖ్యమైనవి. దాని స్వభావాన్ని బట్టి, సమయానికి ఆది ఉంది మరియు అంతముంది. అలాటిది లేకుంటే అది కాలమే కాదు; అది నిత్యత్వమైయుంటుంది. "అంతటనున్న" మరియు దానికి పర్యాయ పదంగా "సర్వవ్యాప్తి" అనేవి దేవుని ఉనికి "అన్ని స్థలాల్లో అన్ని కాలాల్లో" ఉన్నట్టు సూచిస్తున్నాయి. దేవునికి యిది సాధ్యం ఎందుకంటే ముఖ్యాంశంలో "దేవుడు ఆత్మ" (యోహాను 4:24ఎ). గనుక, దేవుడు, ముఖ్యాంశంలో (ప్రాథమిక సారంలో) "ప్రతి స్థలంలో అన్నివేళల ఉన్నాడు." ఆయన ఎక్కడ లేడో అక్కడికి వెళ్లడానికి ఆయన "తీర్మానించుకోడు" – ఎందుకంటే ఆయన అక్కడ ఉండనే ఉన్నాడు! బైబిల్లోని రెండు నిబంధనలలో యిది మాటిమాటికి వ్యక్తపరచబడింది (కీర్తన. 2:4; 3:4; అపొ. 7:49; 17:28).

## దానితో సంబంధపడియున్నవి

దేవుడు "సర్వవ్యాపిగా"నున్న భావన బ్రహ్మాండమైన అర్థముతో యిమిడి ఉంది. "Omni" అంటే సార్వత్రికంగా, నిర్బంధంలేని; "omnipresence" "అన్ని స్థలాలలో అన్నివేళల ఉండడం" అని నిర్వచింపవచ్చు. దేవుడు "అన్ని స్థలాలలో అన్ని వేళల" ఉన్నవాడైయున్నందున – అటు సమయంగాని, యిటు స్థలంగాని ఆయన ప్రసన్నతను తప్పించుకోలేవు. మరోవిధంగా చెప్పాలంటే, దేవుడు సమయానికిగాని స్థలానికిగాని పరిమితుడైయుండడని దీని భావం (2 పేతురు 3:8; కీర్తన. 139:7–10). కాలము యొక్క అతి గొప్ప ఉదాహరణ చరిత్ర అని మనం పిలిచేదే కావచ్చు. కాలము చరిత్రమీదుగా పయనిస్తుంది. "అది కేవలం ఒకదాని తరువాత మరొకటి" అని మనం తరచుగా అంటాం. భూమిమీద మనం కాలపరిమితిచేత కట్టబడిన జీవులం గనుక, ఒకదాని తరువాత ఒకటి జరిగే సంభవాలంటే మనకు ఎంతో ఎక్కువ.

స్థలం కూడా మనకు ప్రాముఖ్యమైనదే, ఎందుకంటే మనం పరిమితమైన వాళ్లమేగాని అపరిమితులం కాము. ఇక్కడ మనం జీవించేటప్పుడు కాలము, స్థలము అనేవాటి హద్దుల్లో మనం బంధించబడియుంటాం. భూగోళ శాస్త్రపు పేజీలో మనలో ప్రతి ఒక్కరం ఒక చుక్కవంటివారమే. మనం ఎల్లప్పుడు "ఇక్కడే" ఉంటాం – ఎన్నడు "అక్కడ" ఉండం. ఏదేని ఒక ప్రత్యేకమైన తత్క్షణంలో, మనం ఒక నిర్ణీతమైన స్థలంలో ఉంటాం. ఆ సెకండులో, ఆ స్థలం "ఇక్కడే" – అది ఎన్నడు "అక్కడ"యై ఉండదు. "అక్కడ" ఉన్నట్టు మనం ఆలోచింపవచ్చు. ఏదియెలాగున్నా, ఇవ్వబడిన ఏ కాలంలోనైనా నిర్ణీతమైన

ఏ స్థలంలోనైన మనం ఎక్కడ ఉన్నామనేది "ఇక్కడే."

అన్ని స్థలాల్లో అన్నివేళలా ఉండే దేవునితో మన పరిమితి స్థితిని వర్ణించి, తారతమ్యాన్ని సూచించే ప్రయత్నమే ఈ చర్చయైయుంది. ఆయన కాలము, స్థలము అనేవాటిలో నివాసం చేయడు. మనమైతే కాలము, స్థలములచేత బంధింపబడియున్నాం. దేవుడు నిత్యుడు గనుక ఆయన కాలము, స్థలములచేత పరిమితి చేయబడడు (యెషయా 57:15). తన అపరిమితత్వంచేత దేవుడు కాలాన్నీ స్థలాన్నీ చుట్టుకొనియుంటాడు. తన నిత్యత్వపు స్వభావాన్నిబట్టి, ఏదియెలాగున్నా, కాలానికి స్థలానికి అతీతుడైయున్నాడు. "నేనున్నాను" అంటూ తన్ను తాను గొప్పగా బయలుపరచుకొనడంలో ఉన్న ప్రాముఖ్యత యిదే. *Yahweh* అనే పదం "ఉండుట," – ఉనికి కలిగియుండుట అనే క్రియావాచకపు రూపం.

నిత్య దేవుడుగా, ఆయనకు "గతం" లేదు, "భవిష్యత్తు" లేదు. "గతం," "భవిష్యత్తు" అనే భావాలు కాలమనే వస్త్రంతో చుట్టబడినవే. కాలము, నిత్యత్వము అనేవి ఒక్కటే కావు. నిత్యత్వమనేదే బహు "దీర్ఘకాలం" కాదు. నిత్యత్వం ఎప్పటికి ఉండేది. దానికి ఆదిలేదు, అంతమూ లేదు. దేవుడు "అల్ఫయు ఓ మెగయునై యున్నాడు" (ప్రకటన 1:8). కాలము, చరిత్ర అనేవాటి వాకిటి వద్ద ఆయన నిలిచి ఈ లోకానికి సంబంధించిన వాస్తవాన్ని గూర్చిన జ్ఞానాన్ని ఆయన మనకు ప్రసాదించాడు. చిట్టచివరిగా ఆయన సమయాన్ని చరిత్రను ముగించి, నిత్యత్వాన్ని గూర్చిన నిజమైన సంపూర్ణమైన జ్ఞానాన్ని మనకు దయచేస్తాడు. కాలాన్ని, చరిత్రను ఉనికిలోనికి తెచ్చిన ఆయన, కాలము, చరిత్ర అనే రెండింటికి అతీతుడైయున్నాడని నొక్కి చెప్పవలసియుంటుంది.

## సంగ్రహము

దేవుని ఎసెన్స్ (సారం) ఆత్మ. దేవుడు కేవలం కాలంలో (తాత్కాలికంగా) ఎల్లప్పుడు ఉన్నవాడు మాత్రమే కాదు, ఈ మహా విశ్వంలో ఎల్లవేళలా ఉన్నవాడైయున్నాడు. ఆయన నిరంతరం ఉన్నవాడని బైబిలు స్థిరపరుస్తుంది. అంటే, ఆయన ఏ హద్దులకైనా అతీతుడే. సమయానికీ (చరిత్రకు), విశాలానికీ (స్థలానికి), సృష్టికీ ఆయన అతీతుడైయున్నాడు.

కాలము మరియు స్థలము అనే మన పరిమితి భావాల్లో, దేవుడు "ఇక్కడ" లేక "అక్కడ" అని మనం తరచుగా మాట్లాడుతాం. మనం చూచినట్టే, అలాగే బైబిలు లేఖకులు కూడా. కాలపు హద్దుల్లో మరియు స్థలపు హద్దులతో బంధింపబడియున్న జీవులకు దేవుణ్ణి ఈ విధంగా మాట్లాడడం అవసరమే. ఏదియెలాగున్నా, ఆయన నిత్యుడని కూడా మనం మాట్లాడుతాం. మనం అలా ఎందుకు చేస్తున్నామంటే, దేవుడు, సారంలోను, కాలంలోను, స్థలంలోను ఉన్నవాడై స్థలము, కాలములకు అతీతుడైయున్నాడు. ఈ దృష్టినుండి చూస్తే ఆయన ఎల్లప్పుడు "ఇక్కడ" యిప్పుడు ఉన్నాడు. "ఆయన అక్కడ ఉన్నాడా?" అనే మన విచారణకు, ఆయన జవాబు, "అవును నేను యిక్కడే ఉన్నాను" అనేది. మనం ఈ విశ్వాన్ని దాటిన ఏ స్థలాన్నిగూర్చి (అది ఉంటే) ఆలోచించినా, విశ్వంవరకే అయినా, మన సొంత లోకమైనా, లేక మన జీవితాలే అయినా సరే యిది

సత్యమైయుంటుంది. ఈ దేవునియందు "మనం జీవిస్తున్నాం చలిస్తున్నాం, ఉనికి కలిగియున్నాం" (అపో. 17:28). మన దేవుడు బహు చిన్నవాడా? కాదు. కనీసం యిప్పటికైనా, ఆయనను సంపూర్ణంగా చూడగల మన సామర్థ్యం లోపంగా ఉంటుంది.

మానవుని పరిమితులను మరియు దేవుని అపరిమితత్వాన్నీ కీర్తన రచయిత గుర్తిస్తున్నాడు. ఈ భావాలను అతడు కీర్తన. 139:7–12లో వ్యక్తపరుస్తున్నాడు:

> నీ ఆత్మయొద్దనుండి నేనెక్కడికి పోవుదును?
> నీ సన్నిధినుండి నేనెక్కడికి పారిపోవుదును?
> నేను ఆకాశమున కెక్కినను నీవు అక్కడను ఉన్నావు,
> నేను పాతాళమందు పండుకొనినను నీవు అక్కడను ఉన్నావు.
> నేను వేకువ రెక్కలు కట్టుకొని,
> సముద్ర దిగంతములలో నివసించినను,
> అక్కడను నీ చేయి నన్ను నడిపించును,
> నీ కుడిచేయి నన్ను పట్టుకొనును.
> "అంధకారము నన్ను మరుగు చేయును,
> నాకు కలుగు వెలుగు రాత్రివలె ఉండును"
> అని నేననుకొనిన యెడల,
> చీకటియైనను నీకు చీకటి కాకపోవును,
> రాత్రి పగటివలె నీకు వెలుగుగా ఉండును
> చీకటియు వెలుగును నీకు ఏకరీతిగా ఉన్నవి.

---

సూచనలు

[1]సెకండుకు 186,000 మైళ్లు వేగంతో పయనించే వెలుగు ఒక సంవత్సరం పాటు ఎంత దూరం పయనించగలదో దానిని కాంతి సంవత్సరమంటారు. ఇది: 5.9 trillion miles కావచ్చు (186, 000X60X60X24X365 నీవే లెక్కచూచుకో.) [2]Robert Jastrow, *God and the Astronomers* (New York: W. W. Norton, 1978), 41ff.